వరదనీరు సజావుగా వెళ్లేలా చర్యలు

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, అక్టోబర్ 17: నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ..వరదనీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్, డీఎంసీ మారుతీ దివాకర్, సీపీఎల్ అడిషనల్ డీసీపీ వెంకట్రావ్, ఏసీపీ మురళీధర్‌తో పాటు పలువురు అధికారులతో కలిసి ఆయన.. అంబర్‌పేట డివిజన్, పటేల్ నగర్ చౌరస్తా నుంచి ప్రేమ్‌నగర్ గ్రీన్ ల్యాండ్ వరకుగల వరదనీటి కాలువను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాలాలో వరద ఉధృతిని పరిశీలించారు. పటేల్ నగర్ దేవస్థానం వెనుక ఉన్న వరద కాలువకు రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు నాలా పూడికతీత పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రూ.కోట్లాది వ్యయంతో అంబర్‌పేట నియోజకవర్గంలోని నాలాలను ఆధునీకరించామన్నారు. దీంతో ఇటీవల అంబర్‌పేటలో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైనా ఎలాంటి ముంపు సమస్య ఏర్పడలేదని అన్నారు. ముందస్తు ప్రణాళికతో చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పటేల్‌నగర్ వరద నీటి నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, అధికారులు

ప్రజలకు నీటి కష్టాలు రాకుండా చూస్తా

డివిజన్-3 జీఎం శ్రీను నాయక్

మెహిదీపట్నం అక్టోబర్ 17: ప్రజలకు నీటి కష్టాలు రాకుండా కృషి చేస్తానని జలమండలి డివిజన్-3 జీఎం శ్రీను నాయక్ అన్నారు. గురువారం జలమండలి డివిజన్ (మెహిదీపట్నం) -3 జీఎంగా శ్రీనునాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. డివిజన్-3 పరిధిలోని అన్నీ ప్రాంతాల్లో నీటి సమస్యలు లేకుండా నిరంతరం కృషి చేస్తానని అన్నారు. మెహిదీపట్నం, మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, టోలీచౌకి, గుడిమల్కాపూర్, గోల్కొండ, లంగర్‌హౌస్, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తామని చెప్పారు. అదే విధంగా నీటి లీకేజీలు లేకుండా, సీవరేజి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

కరెంట్ కష్టాలు లేకుండా చేస్తా

ఆసిఫ్‌నగర్ విద్యుత్ డీఈ సుధీర్

మెహిదీపట్నం : ప్రజలకు కరెంట్ కష్టాలు లేకుండా కృషి చేస్తానని ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ డీఈ సుధీర్ అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి బదిలీ కావడంతో సుధీర్ నూతన డీఈగా పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ..ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని నాంపల్లి,కార్వాన్ నియోజకవర్గాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉత్తమ సేవలు అందిస్తామన్నారు.

ర్యాగింగ్, డ్రగ్స్ జోలికి వెళ్లవద్దు : డీసీపీ

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 17: వైద్య విద్యార్థులు ఉన్నతంగా విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేసే విధంగా ఎదగాలని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో నూతనంగా చేరిన వైద్య విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ర్యాగింగ్, మత్తు పదార్థాల జోలికి వెళ్లి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రగ్స్, ర్యాగింగ్ జోలికి వెళ్లమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారితో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు

మాంసం దుకాణాలవారు వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ వేయవద్దు : డీసీపీ

మెహిదీపట్నం అక్టోబర్ 17: ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మాంసం దుకాణాల వారు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని, ఒకవేళ వేస్తే చర్యలు తప్పవని దక్షిణ ,పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ అన్నారు. గురువారం సాయంత్రం గోల్కొండ ఏసీపీ కార్యాలయంలో గోల్కొండ, లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని మాంసం దుకాణాల నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ ..మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను తరలించే విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్లు సైదులు, రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హుమాయూన్‌నగర్ పీఎస్‌లో..

హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మాంసం దుకాణాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ పలు సూచనలను చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

మాసాబ్‌ట్యాంక్ పీఎస్‌లో..

మాసాబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాంసం దుకాణాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి పాల్గొని చెత్త,వ్యర్థాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పల్లాటి నరేశ్‌కు లెఫ్టినెంట్ ఆర్మీ ర్యాంకు హోదా

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 17: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని సైఫాబాద్ సైన్స్ పీజీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేశ్‌కు లెఫ్టినెంట్ ఆర్మీ ర్యాంకు హోదా లభించింది. నాగ్‌పూర్‌లోని ఎన్‌సీసీ అధికారుల శిక్షణా శిబిరంలో మూడు నెలల పాటు మిలిటరీ శిక్షణ పూర్తి చేసిన డాక్టర్ పల్లాటి నరేశ్‌కు మేజర్ జనరల్ కపిల్ జీత్ సింగ్ రాథోర్ చేతుల మీదుగా లెఫ్టినెంట్ ఆర్మీ ర్యాంకును అందుకున్నారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. లెఫ్టినెంట్ ఆర్మీ ర్యాంకు కార్డును అందుకునేలా తనను ప్రోత్సహించిన హైదరాబాద్ (గ్రూపు కమాండర్ కల్నల్ అనిల్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ వీఎం రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకొని నగరానికి తిరిగి వచ్చిన డాక్టర్ నరేశ్‌కు తెలంగాణ 3 బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్‌లు స్వాగతం పలికి అభినందించారు.

సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పల్లాటి నరేశ్‌కు లెఫ్టినెంట్ ఆర్మీ హోదాను అందజేస్తున్న మేజర్ జనరల్ కపిల్ జీత్ సింగ్

ఘనంగా దుగ్గిరాల సోమేశ్వరరావు జయంతి వేడుకలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 17: నాటకరంగానికి అంకితభావంతో పనిచేసిన దుగ్గిరాల సోమేశ్వరరావు నేటి కళాకారులకు ఆదర్శప్రాయులని వక్తలు అన్నారు. రసరంజని, దుగ్గిరాల ఫ్యామిలీ సంయుక్తాధ్వర్యంలో ప్రముఖ నటులు, దర్శకులు దుగ్గిరాల సోమేశ్వరరావు 92వ జయంతి వేడుకలు నాంపల్లిలో గల పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దుగ్గిరాల సోమేశ్వరరావు పేరిట నెలకొల్పిన ఆత్మీయ పురస్కారాలను సీనియర్ నటులు సి.హెచ్ నారాయణస్వామి, నటులు, దర్శకులు కేతినీడి నటరాజ్, సత్కళాభారతి సత్యనారాయణ, దర్శకురాలు డాక్టర్ బి.హెచ్ పద్మప్రియలకు ప్రదానం చేసి సత్కరించారు. విశ్రాంత డీజీపీ హెచ్.జె దొర, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి రమణాచారి, నటులు, దర్శకులు బి.ఎమ్ రెడ్డి, ప్రముఖ సంఘసేవకులు సారిపల్లి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం నాయకుడు క్రాంతి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరు

కాచిగూడ, అక్టోబర్ 17: భూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజలు ఛీ కొడుతున్నారని బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం నాయకుడు గుమ్మడి క్రాంతి ఆరోపించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ భవన్‌లో విద్యార్థి విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బృహోత్తర ప్రణాళికలతో తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాడని అన్నారు. స్వచ్ఛమైన పాలన, పట్టుదల ఉన్న వ్యక్తిని సీఎం కేసీఆర్‌లో చూస్తున్నామని పేర్కొన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పాండు రంగ, మహ్మద్ గౌస్, తదితరులు ఉన్నారు.

బీసీల హక్కులను అణిచివేస్తున్న మోదీ ప్రభుత్వం

మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ,అక్టోబర్ 17: బీసీలకు రావాల్సిన హక్కులను కల్పించకుండా మోదీ ప్రభుత్వం అణిచివేస్తుందని, బీసీల పట్ల వ్యతిరేక వైఖరి అవలంబిస్తుందని, ఇక బీసీల తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచి, కులాలవారీగా తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన బీసీల డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ వెంటనే అమలు చేయాల ని, విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 నుంచి 52 శాతానికి పెంచా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. గురువారం లంగర్‌హౌస్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రవియాదవ్, ఎంఐఎం నాయకులు సునంద, గోపాల్ , విజయ్, శారదలు టోలీచౌకిలో ఎమ్మెల్యేను కలిసి ప్రశాంత్‌నగర్‌లో రోడ్ల సమస్యలపై ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే .. జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. *– మెహిదీపట్నం అక్టోబర్ 17*

రోడ్డు ప్రమాదంలో సీనియర్ జర్నలిస్ట్ దుర్మరణం

రాములు గౌడ్ (ఫైల్)

మెహిదీపట్నం, అక్టోబర్ 17: టిప్పర్ అదుపు తప్పి బైక్‌ను ఢీ కొట్టడంతో సీనియర్ జర్నలిస్ట్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం....వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం, తిర్మలాపూర్‌కు చెందిన పోగుల రాములు గౌడ్(52) సీనియర్ జర్నలిస్ట్. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్ హైదర్‌గూడ ఎర్రబోడ వీకర్ సెక్షన్ కాలనీలో ఉంటూ ఓ పత్రికను నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఇబ్రహీంబాగ్ తారామతి బారాదరి సమీపంలో పెట్రోల్ బంక్ నుంచి బైక్‌పై రోడ్డుపైకి వస్తుండగా వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలకు గురైన రాములు గౌడ్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న గోల్కొండ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. రాములుగౌడ్ మరణ వార్త విన్న హైదర్‌గూడ ఎర్రబోడ వీకర్ సెక్షన్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇంటి ముందు పార్కు చేసిన రెండు బైకులు దగ్ధం

గోల్నాక, అక్టోబర్ 17: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం..అంబర్‌పేట, ప్రేమ్‌నగర్ హనుమాన్ టెంపుల్ గల్లీకి చెందిన అరుణ్, బాలరాజులు గత బుధవారం రాత్రి తమ ఇంటి ముందు ఎలక్ట్రిక్ బైక్, హోండా యాక్టివాలను పార్క్ చేశారు. కాగా...అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి ముందు పార్క్ చేసిన రెండు బైక్‌లకు మంటలు అంటుకున్నాయి. గమనించిన చుట్టు పక్కల వారు కేకలు వేయగా యజమానులు వచ్చి చూడగా అప్పటికే బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలబాలికల్లో మానసిక దృఢత్వం పెంపొందించాలి

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 17. బాలబాలికల్లో మానసిక దృఢత్వం పెంపొందించి బాధ్యతాయుతమైన యువతగా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ కరీం పిలుపునిచ్చారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా నాంపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వారోత్సవాలు బుధవారంతో ముగిసాయి. గత వారం రోజులుగా మెరుగైన రేపటి భవిష్యత్ కోసం బాలికలకు మానసిక అవగాహన, భద్రతకు భరోసా అనే అంశాలపై సదస్సులు, వయోవృద్ధుల సమస్యలపై మానసిక నిపుణులతో సైకాలజికల్ క్యాంపులు నిర్వహించి అసమానతలను రూపుమాపేలా కృషి చేసినట్లు కరీం పేర్కొన్నారు. సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎ.రాకేశ్‌కుమార్, డాక్టర్ కృష్ణ గోపాల్ భండారి, శిశ, భాస్కర్, సీనియర్ సిటిజన్స్, బాలబాలికలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ డాక్టర్ సూర్య ధనావత్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆమెకు పూర్వ వీసీ ప్రొఫెసర్ ఎం. విజ్జులత బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆమె భాధ్యతలను స్వీకరించారు. *– సుల్తాన్‌బజార్,అక్టోబర్ 17*

మహిళా బిల్లులో ఉపకోటా కల్పించాలి

కాచిగూడ,అక్టోబర్ 17: మహిళా బిల్లులో ఉపకోటా కల్పిం చి, లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదించాలని జాతీయ ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. మహిళా బిల్లులో ఉపకోటా కల్పించాలని కోరుతూ గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

రైల్లో మహిళ మృతి

కాచిగూడ,అక్టోబర్ 17: అనారోగ్యంతో ఎంఎంటీఎస్ రైల్లో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది.కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గుర్తుతెలియని మహిళ(40) బుధవారం రాత్రి లింగంపల్లి-ఫలక్‌నామ ఎంఎంటీఎస్ రైల్లో మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతిరాలి ఒంటిపై ఎరుపు, నీలి రంగు చూడీ పైజామా, పసుపు రం గు స్వెటర్ ధరించి, ఎత్తు 5.6 ఉన్నట్లు పేర్కొన్నారు. మృతిరాలి వివరాల కోసం ఫోన్: 8712568495 లో సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కాచిగూడ,అక్టోబర్ 17: కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కాచిగూడ అడ్మిన్ ఎస్సై సుభాశ్ వివరాల ప్రకారం..మలక్‌పేట ప్రాంతానికి చెందిన మల్లయ్య(57)ద్విచక్ర వాహనంపై కోఠి నుంచి మలక్‌పేటకు వెళ్తున్నాడు. మార్గమధ్య చాదర్‌ఘాట్‌లో గుర్తుతెలియని కారు ఢీకొనడంతో మల్లయ్యకు కుడికాలుకు తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన టీజీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ, అసోసి యేట్ అధ్యక్షుడు బి.శ్యాం, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం *– సుల్తాన్‌బజార్,అక్టోబర్ 17*

'మంద కృష్ణ మాదిగ 60 రోజుల ఉద్యమం ఆపు'

రవీంద్రభారతి, అక్టోబర్ 17: మందకృష్ణ మాదిగ 60 రోజులు ఉద్యమం ఆపాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉప సంఘం వేసి క్షేత్రస్థాయిలో మాదిగ జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయడం కోసం 60 రోజుల గడువు పెట్టి ఏకసభ్య కమిషన్ వేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ కబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని ప్రధాన డిమాండ్‌తో సమ్మేళనాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం, మాదిగల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోర రాజయ్య, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కల గడ్డ చంద్రశేఖర్, బోరెల్లి సురేశ్, చిరుమర్తి రాజు, నక్క మహేశ్, జోగు గణేశ్, శ్రవణ్ కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టండి

మెహిదీపట్నం అక్టోబర్ 17 : ప్రజలకు అభివృద్ధి పనులను అందించడానికి కృషి చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ సర్కిల్ -12 డిప్యూటీ కమిషనర్ నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం మల్లేపల్లి డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్.. డిప్యూటీ కమిషనర్‌ను కలిసి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. వెంటనే పనులను పూర్తి చేయాలని కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు.

మంచినీటి సమస్యలు పరిష్కరించాలి

అబిడ్స్, అక్టోబర్ 17 : బేగంబజార్ డివిజన్‌లో వాటర్ వర్క్స్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం .ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ విషయమై వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌ను కలిసి సమస్యల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బేగంబజార్‌లో కలుషిత నీటి సరఫరాతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని, జగ్జీవన్‌రాంనగర్‌లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా బొగ్గులకుంటలో సమస్య ఉందని అర్ధరాత్రి ఫోన్ చేస్తే ఉదయం లోపు పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రజల సమస్యల కోసం నిరంతరం పాటుపడుతున్నామని ఆయన అన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 17: సమాజానికి ఆదికవి వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని సింగరేణి జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభానీ అన్నారు. సింగరేణి భవన్‌లో గురువారం ఆదికవి మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. పురాణ, ఇతిహాస గ్రంథాలను నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ పఠించి.. అందులోని సారాన్ని స్వీకరించి.. ఆనందకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. వాల్మీకి సం స్కృతంలో రచించిన రామాయణ గాథ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని వివరించా రు. ఆయన జీవితం ఆదర్శప్రాయమని తెలుసుకోవాలన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్ ప్రసాద్, జనరల్ మేనేజర్ మా ర్కెటింగ్ రవిప్రసాద్, పలు విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

● అబిడ్స్, అక్టోబర్ : న్యూ ఉస్మాన్‌గంజ్‌లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధరంవీర్ వాల్మీకి, ఆకాశ్ వాల్మీకి, విశాల్ వాల్మీకిల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఖైరతాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడు, సెట్విన్ మాజీ డైరెక్టర్ ధన్‌రాజ్ విచ్చేసి వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ.. వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఐఏఎస్ ఆఫీసర్ బుర్రా వెంకటేశం

ఆకట్టుకున్న ప్రదర్శనలు

రవీంద్రభారతి,అక్టోబర్ 17: రామప్ప శిల్పాల ప్రేరణగా శివతాండవం, కోలాటాలు, కృష్ణుని రాసలీలలు, కూచిపూడి పేరిణి నృత్యాలు వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. గురువారం తెలంగాణ భాషా సంస్థ సౌజన్యంతో భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధానమందిరంలో ప్రైడ్ ఆఫ్ రామప్ప పేరుతో ప్రదర్శనలు అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, గవర్నర్ కార్యదర్శి బుర్ర వెంకటేశం, తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య ప్రదర్శనలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, మోహనయ్య, భారత రంగస్థలి అధ్యక్షుడు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యాయదేవత కళ్లకు గంతలు తొలగించడంపై హర్షం

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : న్యాయదేవత కళ్లకు గంతలు తొలగించడంపై తెలంగాణ, నాంపల్లి కోర్టులకు చెందిన న్యాయవాదులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తీసుకున్న నిర్ణయం పట్ల అభినందనలు తెలిపారు. న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు భరోసా, పూర్తి నమ్మకం కలిగించే విధంగా ఈ నిర్ణయం ఉందని అన్నారు. విదేశీయుల సంస్కృతి, సంప్రదాయాలకనుగుణంగా ఉన్న న్యాయదేవత విగ్రహానికి కొత్త రూపాన్ని అందించడం ఆనందదాయకమన్నారు. తెలంగాణ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఉపేందర్, శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, లాలరామ్, డి.అనంతరఘు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

19న విశిష్ట డింగరి భరతనాట్య ప్రదర్శన

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 17: ముంబైకి చెందిన నృత్యోదయ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం 5గంటలకు గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ గ్లోబల్‌పీస్ ఆడిటోరియంలో ప్రవాస యువ నృత్యకళాకారిణి విశిష్ట డింగరి భరతనాట్య ప్రదర్శనతో నృత్యార్పణం చేయనున్నట్లు ప్రఖ్యాత భరతనాట్య గురువు డాక్టర్ జయశ్రీ రాజగోపాలన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిదండి చిన శ్రీమన్నారాయణ జీయర్ స్వామి, ప్రముఖ నాట్యగురువు, పద్మ విభూషణ్ డాక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం(చెన్నై), భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కళారత్న అశోక్ గుర్జాలే, తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. విశిష్ట డింగరి అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి కాలిఫోర్నియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. మరో వైపు గత 15ఏళ్లుగా భరతనాట్యం, కూచిపూడి నేర్చుకుంటూ ప్రదర్శనలు ఇస్తూ మంచి నర్తకిగా గుర్తింపును పొందారని పేర్కొన్నారు. నృత్య కళలతోపాటు ఈత పోటీల్లోనూ పాల్గొని మెడల్స్‌ను సాధించి ఛాంపియన్‌గా గుర్తింపు, జాతీయ స్థాయిలో పోలో క్రీడాకారిణిగా మన్ననలు అందుకోవడంతో పాటు కరాటేలో బ్లాక్‌బెల్ట్‌ను సాధించి రికార్డులను సృష్టించారని తెలిపారు.

ఛట్ పూజలకు ఏర్పాట్లు చేయించాలి

అబిడ్స్, అక్టోబర్ 17: ఛట్ పూజలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగేలా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినొద్దీన్‌ను ఛట్ పూజ సమితి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, కార్వాన్ బీఆర్‌ఎస్ యువత అధ్యక్షుడు మంగి కిశోర్ కుమార్‌లు కోరారు. ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. నవంబర్ 7,8 లలో బాపూఘాట్ తపోవన్ పార్క్‌లో నిర్వహించే ఛట్ పూజలకు ఏర్పాట్లు జరిగేలా చూడాలని కోరారు.